
# హజ్బెండూ... అయిపోయావ్!

-ముచ్చర్ల రజనీ శకుంతల



**'నాలుగు...' అంది నళిని బ్లాంక్ ఫేస్ పెట్టి.**

**సుబ్బారావు నళిని వంకోసారి చూసి చిన్నగా నవ్వి 'అయిదు నీ లక్కీ నంబర్ కదూ...' అంటూ ఫెయిర్ అండ్ లవ్లీ ఐదో శాచే ఓపెన్ చేశాడు.**

అర్ధాంతరంగా చర్చలు ఆపి, హడావిడిగా పాక్‌కు తిరిగి వెళ్ళిన ముషారఫ్‌లా ఫేస్ పెట్టి, 'ప్రొసీడ్' అంది నళిని.

సుబ్బారావు మొహం వెండిపూత పూసినట్టుంది. ఓసారి అద్దంలో తనని తాను చూసుకొని, పాండ్స్ శాండిల్ వుడ్ పౌడర్ గుప్పెడు తీసుకొని మొహానికి దట్టంగా దట్టించి,

'నళినీ డాళింగ్! హౌ యామ్ ఐ?' అడిగాడు.

'సో స్మార్ట్...' పైకి అని లోపల మాత్రం 'బుడబుక్కల వాడిలా వున్నాడను'కొంది.

అలా అరగంటపాటు సింగారించుకున్న సుబ్బారావు ఫినిషింగ్ టచ్‌గా మరోసారి అద్దంలో తన ఫేస్ చూసుకొని 'వావ్... ఎంతందంగా ఉన్నావ్రా సుబ్బూ...' అని తనకు తాను కాంప్లిమెంటిచ్చుకొని బయటకు నడిచాడు.

'ఏవండీ... మనం ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం?' అడిగింది మొహాన్ని దీనంగా పెట్టి నళిని.

'ఎక్కడికేమిటి... పిచ్చిప్రశ్న. అలా పక్కవీధిలోకి వెళ్ళి కొత్తిమీర, పచ్చిమిర్చి తెచ్చుకోవడానికి' చెప్పేడు సుబ్బారావు.

'ఎంతసేపట్లో వెళ్ళి రాగలం?' అడిగింది ఏడుపు గొంతుతో.

'ఎంతంటే... జస్ట్ పది నిమిషాలు. మహా అయితే ఫిఫ్టీన్ మినిట్స్.

'హు...' అని సొండిచ్చి ఆకాశం వంక చూసింది నళిని, ఇంటికి తాళం వేసి బయటికొచ్చేక.

'ఆకాశం వంక చూస్తావేమిటి? వర్షం పడేలా ఉందా? రెయిన్ కోటూ, గొడుగూ తెచ్చుకోనా?' అడిగాడు తనూ ఆకాశం వంక చూస్తూ సుబ్బారావు.

'నా బ్రతుకుని చూసి... అలా సింబాలిక్‌గా చూశానన్నమాట. పక్కవీధిలోకి వెళ్ళి కొత్తిమీర కట్ట, పచ్చిమిర్చి తీసుకురావడానికి... మీరు అరగంట తయారవ్వాలా? నా ఖర్మ కాకపోతే...' అంది నళిని.

భళ్ళున నవ్వాడు సుబ్బారావు.

ఆ దారినే వెళ్తున్న వాళ్లు కాశ్మీర్ మిలిటెంట్లు తమ పక్కనే బాంబు వేసినట్టు ఉల్కిపడ్డారు.

నళిని తలపట్టుకుంది.

'నళినీ డాళింగ్! ఆ కొత్తిమీర అమ్మే అమ్మాయి స్మార్ట్‌గా ఉంటుందా?'

నళిని మొగుడి వంక యమ సీరియస్ లుక్కేసింది. అయినా అతన్లో నో రియాక్షన్.

* * *

సుబ్బారావులో ఒక్కటి తప్ప అన్నీ సలక్షణాలే ఉన్నాయి. అమ్మాయిల వీక్నెస్ అతనికి హై రేంజ్‌లో ఉంది. ఆ విషయం నళినికి పెళ్ళయిన కొత్తలోనే తెలిసింది. వాటి తాలూకు మినీ ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్తే...

పెళ్ళయిన కొత్తలో... ఓ రోజు...

* * *

'జోరుగా... హుషారుగా... షికారుగా బీచ్ కెళ్దామా...' అంటూ పెళ్ళాన్ని బీచ్‌కు తీసుకువెళ్లాడు.

'హేవండీ ముంతకింద పప్పు...' అంది గోముగా నళిని.

పెళ్ళయిన కొత్త కదా! భార్యలేమడిగితే కొనివ్వడానికి రెడీగా ఉంటారు భర్తలు.

'ఓస్... అంతేనా... మెడ కింద గుండెకాయ అడిగినా ఇస్తాను' అంటూ ముంతకింద పప్పు కొని పెట్టాడు. ఆ తర్వాత నెక్స్ ట అని అడిగాడు.

నళిని సిగ్గులొలకబోస్తూ, మిరపకాయ బజ్జీల వైపు చేయి చూపెట్టింది. వితిన్ సెకన్స్‌లో మిరపకాయ బజ్జీలు కొని, నిమ్మరసం దట్టంగా పిండించి, పెళ్లాం చేతిలో పెట్టాడు.

'మీ ప్రేమలా ఈ మిరపకాయ బజ్జీలు సమ్మగా ఉన్నాయండీ' అంది నళిని.

'యూనాటీ... తర్వాత ఇంకా మామిడికాయ ముక్కల సీను లేదూ...' అంటూ అవి కూడా కొని పెట్టేడు సుబ్బారావు.

రెండు చేతుల్లో మొహం దాచుకొని 'నాకు సిగ్గు బాబూ...' అంది. అది చూసి మామిడికాయ ముక్కలు అమ్మే అబ్బాయి కూడా సిగ్గుపడిపోయేడు.

సుబ్బారావు, నళిని తింటుంటే గమ్మత్తుగా చూడసాగాడు. కారం, ఉప్పు రాసిన ముక్కల్ని హాయిగా తినేస్తోంది. ఏ మాత్రం కారం అనకుండా.

నాలుగో ముక్క దగ్గర మాత్రం కాస్త ఆగింది.

'అబ్బ! కారం!' అంది అప్పుడు.

'నీకు మినరల్ వాటర్ బాటిల్ తెస్తానుండు...' అంటూ పరుగెత్తాడు సుబ్బారావు. తొలి రోజుల ప్రేమ కదా! అలానే ఉంటుంది మరి.

'నా మంచి మొగుడు, బంగారు మొగుడు...' అని మొగుడ్ని మెచ్చుకుంటూ... ఒకట్రెండు మూడ్నాలుగు ఐదారు నిమిషాలు ఎదుర్చూసింది. అయినా మొగుడి జాడ లేదు. కంగారుపడి ముందుకు వెళ్ళి అక్కడి సీన్ చూసి స్టన్నయిపోయింది.

* * *

'ఒక బిసిలరీ ఇవ్వండి' అడిగాడు సుబ్బారావు కొట్టులో వున్నావిడను.

ఆవిడ బిసిలరీ వాటర్ బాటిల్ ఇచ్చి, డబ్బుల కోసం చేయి చాచింది.

'అబ్బ... మీ చేతిలో అదృష్టం ఆరు కిలోమీటర్లుంది....' అన్నాడు ఆవిడ చేతిని చూస్తూ.

'నిజ్జమా?' ఆవిడ బోలెడు సిగ్గుపడిపోయింది.

'జయప్రద చేతిలోని అందం, శ్రీదేవి ముక్కులోని చందం... మనీషా కొయిరాలా మెడ... ప్రీతిజింటా హాయిలా... సూపర్బ్...' అన్నాడు.

ఆవిడ మెలికలు తిరిగిపోయింది.

అతను మెల్లిమెల్లిగా అడ్వాన్స్ అవబోతున్నాడు.

అప్పుడే నళిని వెళ్ళింది. మొగుడ్ని అక్కణ్నుంచీ లాక్కొచ్చేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది.

* * *

'దిసీజ్ టూమచ్' అంది నళిని.

'సారీ, సిక్స్‌మచ్ అయినా నేనేం చేయలేను. అయామ్ హెల్ప్‌లెస్...' అన్నాడు టేబుల్ ఫ్యాన్ వంక చూస్తూ.

ఏడ్చింది. బ్రతిమిలాడింది. మూడంకె వేసింది. డైవోర్స్ వార్నింగ్ ఇష్యూ చేసింది. అయినా నో రిజల్ట్.

మరోసారి సినిమా హాలు దగ్గర...

* * *

'నీ అభిమాన హీరో జగపతిబాబు సినిమా కదా... రష్ బాగా ఉంది. టికెట్ నువ్వే తీస్కోరాదూ...' అన్నాడు సుబ్బారావు.

'అలానే' అంది క్యూలో నిలబడి, పోస్టర్ మీద జగపతిబాబు ముద్దొస్తూ ఉన్నాడు.

టికెట్స్ తీసుకొని మొగుడి కోసం చూసింది.

న్యూస్ రీల్, టైటిల్స్, ఇంట్రవెల్ అయిపోయేయి. మొగుడి జాడ లేదు. పోలీసు కంప్లైంట్ ఇద్దామని వెళ్తూంటే బ్లాక్ టికెట్స్ అమ్మే అమ్మాయితో జోకులేస్తూ మెలికలు తిరుగుతున్నాడు.

* * *

'హలో...'

ఫ్లాష్‌బ్యాక్‌లో నుంచి బయటకు వచ్చింది నళిని.

సుబ్బారావు అప్పటికే బ్యాక్ పాకెట్‌లో నుంచి దువ్వెన తీసుకొని క్రాఫ్ సరిచేసుకొని, కొత్తిమీర అమ్మే శాల్తీల వంక చూశాడు. అందరూ ముసలీ, ముతకా... చివరాఖరికి ఓ థర్టీ ప్లస్‌ను సెలక్ట్ చేసుకొని అక్కడికి వెళ్లేడు.

'కొత్తిమీర ఎలా?' అడిగాడు థర్టీప్లస్‌ను సుబ్బారావు.

'ఎలా అంటే... డబ్బులిచ్చి...' అందా థర్టీప్లస్ చిలిపిగా.

'అయ్యబాబోయ్... నీలాంటి చిలిపి నా పక్కనుంటేనా?' అని పక్కనే భార్య వైపు చూసి 'నళినీ డాళింగ్... ఇక్కడ పచ్చిమిర్చి చచ్చుపుచ్చు... ఆ మూలకు వెళ్లి ఆ తాత దగ్గర తీసుకురా... నేనిక్కడ కొత్తిమీర తీసుకుంటాను...' అంటూ భార్యను పంపించేశాడు.

నళిని పచ్చిమిర్చి తెచ్చేసరికి రూపాయికి నాలుగు ఇచ్చే కొత్తిమీర, రెండ్రూపాయలకు ఒక్కటి చొప్పున వంద రూపాయలు పెట్టి యాభై కట్టలు కొనేశాడు. కాదు. ఆ థర్టీ ప్లస్ ఒయ్యారా లొలకబోస్తూ సుబ్బారావు వీక్‌నెస్‌ని ఆసరా చేసుకొని కొనిపించింది.

* * *

నళినికి మొగుడి 'ఆడ వీక్‌నెస్'తో తల వేడెక్కిపోతోంది. బాగా ఆలోచించి... చించీ... చించీ... 'హే కృష్ణా...' అంది వస్త్రాపహరణం సీన్‌లో ద్రౌపదికి మల్లే...

'సిస్టరూ...' అంటూ శ్రీకృష్ణ ప్రత్యక్షమయ్యేడు. నళిని కజినే శ్రీకృష్ణ. అన్నయ్యకు విషయమంతా వివరించింది.

పాదాలు చకచక కదిలాయి. హజ్బెండూ... అయిపోయావ్... అనుకుంది.

* * *

'హేవండీ...' గోముగా పిలిచింది మిడ్‌నైట్ మసాలా చూసే టైంలో మొగుడ్ని నళిని.

'అసలే మిడ్‌నైట్ మసాలా ఎఫెక్ట్... దానికితోడు అందాల బ్యూటీ పెరేడ్.

'వాట్ డియర్' అన్నాడు మెల్లిగా పెళ్ళానికి దగ్గరగా జరిగే ప్రయత్నం చేస్తూ.

'రేపు డాన్స్ ఫెస్టివల్. ఇండియన్ మోస్ట్ ఫేమస్ స్మార్ట్ గాళ్ మనీషా దీక్షిత్ డాన్స్ ప్రోగ్రామ్ ఉంది. అది నాకు చాలా క్లోజ్... డాన్స్ ప్రోగ్రామ్ అయ్యేక మనింటికి డిన్నర్‌కు పిలుద్దాం...' అంది.

అంతే! గురుడు ఫ్లాటయిపోయేడు. ఆహా! నా ఫేట్ మారబోతూంది. ఆ డాన్సర్‌ని కనుక ట్రాప్‌లోకి లాగితే... ఒరే సుబ్బూ! యూ ఆర్ టూ లక్కీ... నోనో... సిక్స్, సెవెన్, నైన్ లక్కీ...' అనుకున్నాడు సుబ్బారావు.

* * *

డాన్స్ ప్రోగ్రామ్ అదిరింది.

మనీషా దీక్షిత్ నడుంని చూసి టెంప్టయ్యాడు. కంఠాన్ని చూసి ఫ్లాటయ్యాడు. ఎత్తయిన గుండెల్ని చూసి థ్రిల్లయ్యాడు. టోటల్‌గా స్టిల్లయ్యాడు.

* * *

ఆ రాత్రి మనీషా దీక్షిత్‌కు తమ బెడ్రూం ఎలాట్ చేశారు. మిడ్‌నైట్ మనీషా దీక్షిత్ రూమ్‌లోకి ఎంటరయ్యేడు. తథాస్తు దేవతలు క్వింటాళ్ళ కొద్దీ జాలి చూపులు చూసేరు.

* * *

'మనీషా దీక్షిత్... ఎంత బాగున్నావే... ఎమోషనల్‌లో 'వే' అనేశాడు...' 'అవునురా' అంది మనీషా దీక్షిత్ డబుల్ ఎమోషనై.

ఆ తర్వాత కాళ్ల బేరంతో మొదలెట్టి, గుండె వేగంతో పైకొచ్చి... వచ్చీ... కెవ్వున కెవ్వు కెవ్వు కెవ్వున కేక వేశాడు.

'వెళ్లొద్దు సుబ్బారావు బావా... నా నాయుడుబావా...' అంటూ మనీషా దీక్షిత్ సుబ్బారావుని చుట్టేసింది. సుబ్బారావు ఏడుపు మొహంతో పెళ్ళాం గదిలోకి పరుగెత్తి... పెళ్ళాన్ని వాటేసుకొని 'వా!' అని ఏడ్చాడు.

'అది... అదసలు మనీషా దీక్షిత్ కాదు... అసలు అది అది కానే కాదు. వా! నన్ను రేప్ చేయబోయేడు. వా! అది అది కాదు... అది వాడు... వా...' అంటూ మొదలెట్టాడు రాగాలు తీస్తూ సుబ్బారావు.

అప్పటికి అతని అవతారం చింకి చేటలా మారింది.

'నాకు తెలుసు...' అంది నళిని.

'నీకు తెలుసా...' బిక్కచచ్చి అడిగేడు సుబ్బారావు.

'తెలుసు... అది... మనీషా దీక్షిత్ కాదు. వాడు... వాడే వీడు...' అంది నళిని.

'అబ్బ... సస్పెన్స్ వద్దే... నీ కాళ్ళు పట్టుకుంటాను. అసలు విషయం చెప్పి చావు' అన్నాడు లబోదిబోమంటూ సుబ్బారావు.

'నేను చెబుతాను బావా...' అంటూ వచ్చింది మనీషా దీక్షిత్... కాదు... కాదు... ఆ వేషంలో ఉన్న శ్రీకృష్ణ.

'అయామ్ శ్రీకృష్ణ... దేశ విదేశాల్లో అమ్మాయి వేషంలో నృత్య ప్రదర్శనలు ఇస్తూంటాను. బ్యాంకాక్‌లో జరిగే 'ఆల్ కజార్ షో'లో కూడా పార్టిసిపేట్ చేశాను. నళిని నా కజిన్... మీ పెళ్ళప్పుడు థాయ్‌లాండ్‌లో ప్రోగ్రామ్‌కు వెళ్ళాను. మొన్ననే ఇండియా... నిన్ననే వైజాగ్ వచ్చాను. నీ విషయం చెప్పి... 'హే కృష్ణా' అంది. ఆ రోజు దుశ్శాసనుడు వలువలు వూడదీస్తూంటే, ద్రౌపది 'హే కృష్ణా' అంది. ఈ రోజు మీలోని స్త్రీలోలత్వమనే దుశ్శాసనుడి నుంచి, మిమ్మల్ని కాపాడుకోవడం కోసం 'హే కృష్ణా' అంటూ ఈ అన్నను పిలిచింది. దట్సాల్... ఐయామ్ సారీ బావా... అందమైన భార్య ఉండగా, పరస్త్రీ వ్యామోహం ఎప్పటికైనా ప్రమాదకరమే... అది చెప్పాలనే...'

'థాంక్యూ బావా... ఆ రోజు భస్మాసురుడి నుంచి శివుడ్ని రక్షించడానికి శ్రీ మహావిష్ణువు మోహినిగా మారాడు. ఈరోజు పరస్త్రీ వ్యామోహమనే నాలోని భస్మాసురుడి నుంచి రక్షించడానికి నువ్వు మోహినిలా మారి బుద్ధి చెప్పావు. ఇంకెప్పుడూ, పక్కింటి వాటా వైపు తొంగి చూడను...' అన్నాడు సుబ్బారావు.

ఆనందం పట్టలేక మొగుడ్ని వాటేసుకుంది నళిని. భార్యను వాటేసుకుని, కిటికీలో నుంచి కనిపించే ఆంటీ వైపు చూసి డైలమాలో పడ్డాడు బుద్ధొచ్చిన సుబ్బారావు.

★

